# కేసీఆర్‌తోనే జనరంజక పాలన

- పేద ప్రజల అండగా బీఆర్ఎస్ పార్టీ
- మూడో సారి అధికారంలోకి రావడం ఖాయం
- వచ్చేనెల ఒకటిన ఇల్లందులో సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ
- కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలి
- ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియానాయక్
- బయ్యారంలో సన్నాహక సమావేశంలో పార్టీ శ్రేణులకు పిలుపు



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, జడ్పీ చైర్‌పర్సన్ బిందు



సమావేశానికి హాజరైన పార్టీ కార్యకర్తలు, నాయకులు

బయ్యారం, అక్టోబర్20 : బీఆర్ఎస్ పార్టీ పేద ప్రజలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే హరిప్రియానాయక్ అన్నారు. వచ్చే నెల ఒకటిన ఇల్లందులో జరిగే సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ విజయవంతం కోసం శుక్రవారం ఆమె బయ్యారం మండలకేంద్రంలోని కోదండ రామచంద్రస్వామి ఫంక్షన్ హాల్‌లో మండల నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ జనరంజక పాలన అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి అండగా నిలిచారని తెలిపారు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఇల్లందు నియోజకవర్గంలో గిరిజన గ్రామాలు సీఎం కేసీఆర్ తీసుకొన్న నిర్ణయాలతో నేడు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో రూ.1800 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. ఇల్లందు ప్రజల చిరకాలవాంఛ అయిన బస్సు డిపోను ఏర్పాటు చేసుకోగలిగామన్నారు. అదేవిధంగా లక్ష ఎకరాలకుపైగా సాగు నీరందించి, నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేలా తలపెట్టిన సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణం బీఆర్ఎస్‌తోనే సాధ్యమైందని తెలిపారు. బయ్యారం పెద్దచెరువు ఎత్తు రెండు అడుగులకు పెంచి, సీతారామ ప్రాజెక్టు నీటితో నింపి గార్ల, బయ్యారం రైతాంగానికి లబ్ధి చేకూరుస్తామన్నారు. అందుకోసం అదనంగా రూ.3,320 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వంద శాతం సీసీ, బీటీ రోడ్లను పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఇల్లందు అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తామని తెలియజేసేలా ప్రతి ఒక్కరూ ప్రజా ఆశీరాద్వ సభకు తరలిరావాలని కోరారు. సభ విజయవంతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవడం ఖాయమని, మీ ఇంటి ఆడబిడ్డగా ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ బిందు మాట్లాడుతూ.. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, బీసీబంధు, మైనారిటీ బంధు, రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, డబుల్ బెడ్రూం ఇండ్లు, గృహలక్ష్మి, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, పోడు భూములకు పట్టాల పంపిణీ వంటి అనేక పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్నదన్నారు. వీటిని కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని కోరారు. ఇల్లందులో జరిగే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. బయ్యారం మండలం నుంచి సుమా రు పది వేలమంది ఈ సభకు తరలించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియానాయక్ భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. అనంతరం బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాత గణేశ్, పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు బానోత్ మురళీకృష్ణ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రేఖ ఉప్పలయ్య, మండల అధికార ప్రతినిధి సంకు సత్తిరెడ్డి, ఆత్మ కమిటీ జిల్లా మెంబర్ ఏనుగుల ఐలయ్య, బానో త్ శ్రీనూనాయక్, ఎంపీటీసీ కుమారి, కవిత, సర్పంచ్‌లు మమత, వెంకన్న, నాయకులు వీరన్న, వెంకటప తి, లక్ష్మణ్ నాయక్, ఆర్వీ, తొట్టి కృష్ణ, అనిల్, బాబు, రవి, రాము, రమేశ్, వీరన్న, సురేశ్ పాల్గొన్నారు.



ఆగపేటలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

# సంక్షేమ పథకాలే మా బలం

- అభివృద్ధిలో నంబర్‌వన్ తెలంగాణ రాష్ట్రం
- పేదల కోసం అనేక పథకాలు అమలు
- డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

దంతాలపల్లి, అక్టోబర్20 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమ బలమని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామానుజపురం, గున్నెపల్లి, ఆగపేట గ్రామాల్లో ఆయన పలువురు నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో రైతుబీమా, రైతుబంధు, రుణమాఫీ, సాగు, తాగునీరు, ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి, గృహలక్ష్మీ వంటి అద్భుతమైన పథకాలు పేదల కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో తనను దీవించాలని కోరారు. అనంతరం వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, రైతుబంధు సమితి కో ఆర్డినేటర్ వొలాద్రి మల్లారెడ్డి, జిల్లా నాయకులు నూకల గౌతమ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ధర్మరాపు వేణు, తొర్రూరు మార్కెట్ కమిటీ డైరక్టర్ కిశోర్‌కుమార్, నాయకులు నాగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కడుదుల మధుకర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, యాకన్న, రామ్మూర్తి, నరేశ్, వెంకన్న పాల్గొన్నారు.

# వైభవంగా 'సద్దుల బతుకమ్మ'

- పెదమడూరు, ధర్మగడ్డతండాలో రెండు రోజుల ముందే వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఎర్రబెల్లి



ధర్మగడ్డ తండాలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళలు, చిన్నారులు

దేవరుప్పుల, అక్టోబర్ 20 : తెలంగాణ సంస్కృతికి నిదర్శనమైన బతుకమ్మ పండుగ వేడుకలు మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిఏటా ఆనవాయితీ ప్రకారం పెదమడూరు, ధర్మగడ్డతండాలో ఏడో రోజే సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి ఆడిపాడారు. పెదమడూరుకు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ భారీ ఏర్పాట్లు చేశారు. విద్యుత్ లైట్ల వెలుగుల్లో ప్రతి వీధిలో ఎల్ఈడీ టీవీ తెరలు అమర్చారు. గ్రామంలోని ఊర చెరువు వద్ద మహిళలు బతుకమ్మలాడుతుండగా సిరీస్ లైట్ల కాంతులతో ఆ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగులు విరజిమ్మింది. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద 10 ఫీట్ల ఎత్తు ఉన్న బతుకమ్మ పేర్చడం హైలైట్‌గా నిలిచింది. దశాబ్దకాలంగా ఇంతటి భారీ ఏర్పాట్లను తాము చూడలేదని గ్రామస్తులు తెలిపారు. ఘనంగా జరిగిన వేడుకల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బస్వ సావిత్రి, పెదమడూరు సర్పంచ్ సుజనారెడ్డి, ఎంపీటీసీ గిరి, రైతుబంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ పెద్దారెడ్డి, ఉప సర్పంచ్ మానుపాటి వెంకటేశ్వర్లు, జోగు భిక్షపతి, మాటకోడూరు శ్రీనివాస్‌శర్మ, రవీందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణ, బీఆర్ఎస్ గ్రామఅధ్యక్షుడు రాములు, సంపత్, మండల అధ్యక్షుడు దయాకర్, నాయకులు సుందరరాంరెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.



పాలకుర్తిలోని సోమేశ్వరాలయంలో బీ-ఫామ్‌తో పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఎర్రబెల్లి సతీమణి ఉషాదయాకర్‌రావు

# బీఆర్ఎస్‌కు సబ్బండవర్గాల ఆశీర్వాదం

- మరోసారి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విజయం ఖాయం
- ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు

పాలకుర్తి/దేవరుప్పుల, అక్టోబర్ 20 : ఈ శాసనసభ ఎన్నికల్లో సబ్బండవర్గాల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించి మరోసారి సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపడుతారని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి ఎర్రబెలి దయాకర్‌రావు మరోసారి భారీ మెజార్టీతో గెలుస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ మంత్రి ఎర్రబెల్లికి బీ-ఫామ్ అందించిన సందర్భంగా శుక్రవారం పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఉషాదయాకర్‌రావు పూజలు చేశారు. తొలుత బీ-ఫామ్‌తో యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనర్సింహాస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సోమేశ్వరుడి సన్నిధిలో బీ-ఫామ్ ఉంచి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. మరోవైపు ఎర్రబెల్లి బీ-ఫామ్‌కు దేవరుప్పుల మండలం కడవెండిలోని తిరు కుటుంబం చర్చిలో ఫాదర్ జయరాజ్ ఆశీర్వచనం చేశారు. కామారెడ్డిగూడెంలోని మసీదులో మతగురువు ఇనాయత్ రసూల్ ప్రార్థనలు చేశారు. ఈ ఎన్నికల్లో గతంలో కంటే ఎర్రబెల్లికి మరింత మెజార్టీ రావాలని ఉషాదయాకర్‌రావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వీరమనేని యాకాంతారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



తొర్రూరులోని అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి అమరులైన జవాన్లకు నివాళులర్పిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ సత్యనారాయణ

# పోలీసుల త్యాగాలను స్మరించుకోవాలి

తొర్రూరు, అక్టోబర్ 20: విధి నిర్వహణలో, శాంతిభద్రత పరిరక్షణలో అమరులైన పోలీసుల త్యాగాలను ప్రతి పౌరుడు స్మరించుకోవాలని తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వరబాబు సూచించారు. అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వివిధ వర్గాల ప్రజలతో కలిసి అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. సీఐ వై సత్యనారాయణ, ఎస్సైలు జగదీశ్, రాంజీనాయక్, ఇతర సిబ్బంది నేతృత్వంలో అమరవీరుల స్తూపం నుంచి గాంధీ విగ్రహం మీదుగా తిరిగి స్తూపం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.